ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
గురువారం 19 డిసెంబరు 2024

క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయ సమీపంలో గల ఐఎంఏ భవనంలో ఈనెల 21వ తేదీన నిర్వహించనున్న ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల రోటరీ క్లబ్ నాయకులు మంచాల కృష్ణ కోరారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తుండడం జరుగుతుందన్నారు. శిబిరంలో పాల్గొనే వారికి అవసరమైనచో పలు పరీక్షలు ఉచితంగా చేయబడునన్నారు. ఈనెల 21వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ముందుగా రిజిస్ట్రేషన్ కొరకు 9885622332, 7729985110 సెల్ నంబర్లకు కాల్ చేయాలన్నారు.

జాకీర్ హుస్సేన్ మృతి తీరని లోటు

జగిత్యాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంగీతంలో తబలా విద్వాంసుడుగా ప్రపంచానికి పరిచయం అయిన ప్రముఖ తబలా కళాకారుడు జాకీర్ హుస్సేన్ మృతి సినీ సంగీతానికి తీరని లోటని జగిత్యాల కళాశ్రీ అధినేత గుండేటి రాజు ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. జాకీర్ హుస్సేన్ కళా నైపుణ్యం మరవలేనిదన్నారు.

ఆలయ భూముల అన్యాక్రాంతానికి చెక్

- దేవాలయాలకు జియో ట్యాగింగ్
- సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు

జగిత్యాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ, ధర్మదాయ శాఖ పరిధిలోని ఆలయాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఆలయాల పూర్తి సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తోంది. జిల్లాలోని ఆలయాలకు సంబంధించి ఈ ప్రక్రియ ఇప్పటికే మొదలు పెట్టారు. జిల్లాలోని ఆలయాలను సులభంగా గుర్తించడమే కాకుండా వాటి పరిధిలోని భూములు, ఆస్తుల వివరాలు తక్షణమే తెలిసేలా వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. అన్ని రకాల ఆలయాల సమాచారాన్ని గ్లోబల్ పోజిషనింగ్ సిస్టం (జీపీఎస్)తో అనుసంధానం చేస్తున్నారు. ఆలయాల సమాచారం గూగుల్ మ్యాప్స్‌లో పొందేలా త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నారు.



వార్షిక ఆదాయాన్ని బట్టి కేటగిరీ వారీగా...

జిల్లాలో దేవాదాయ ధర్మదాయ శాఖ పరిధిలో రిజిస్టర్ అయిన ఆలయాలు సుమారు వెయ్యి వరకు ఉన్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సుమారు 3 వేల వరకు రిజిస్టర్ ఆలయాలున్నట్లు అంచనా ఉంది. ఇందులో సుమారు 1,200 ఆలయాలను తొలివిడతలో జియో ట్యాగింగ్ చేస్తున్నారు. ఆలయాలకు వచ్చే వార్షిక ఆదాయాన్ని బట్టి ఆలయాలను వివిధ కేటగిరీలుగా విభజించారు. వాటిలో 6ఏ, 6బీ, 6సీ వారిగా ఉన్నాయి. అన్ని ఆలయాల పరిధిలో దాదాపు వందల ఎకరాల భూమి ఉన్నట్లు అంచనా ఉంది. వాటిలో సుమారు పదుల సంఖ్యలో ఎకరాల భూమి కబ్జాకు గురైనట్లు సంబంధిత వర్గాలు అంటున్నాయి. కబ్జాదారుల్లో కొందరికి నోటీసులు ఇవ్వగా మరికొన్ని న్యాయపరమైన అంశాలను ఎదుర్కొంటున్నాయి.

(మిగతా 8వ పేజీలో)

ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక చర్యలు

జగిత్యాల మున్సిపల్ కమిషనర్ చిరంజీవి

ఇంటర్వ్యూ



జగిత్యాల అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ నిషేదంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల జరిగే నష్టాలను ప్రజలకు వివరించడంతో పాటు త్వరలో ప్లాస్టిక్ వాడకంపై నిషేదం విధించి, వాడినవారికి భారీగా జరిమానాలు విధిస్తామని జగిత్యాల మున్సిపల్ కమిషనర్ చిరంజీవి అన్నారు. మంగళ వారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను పాఠకుల ముందు ఉంచారు.

ఆంధ్రజ్యోతి : హోటళ్లు, మెస్‌లు, బేకరీలలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. దీనిపై మీరు ఏమి చర్యలు తీసుకుంటారు ?

మున్సిపల్ కమిషనర్ : పట్టణంలో ఇటీవల పలు హోటళ్లలో వినియోగదారులకు ఇచ్చే ఆహారంలో పురుగులు రావడం, బేకరీలలో కాలం చెల్లిన కేక్‌లు, ఇతర తిను బండారాలు అమ్మడంపై తమకు పలు ఫిర్యాదులు వచ్చాయి. వాటిపై స్పందించి చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి : పట్టణంలో ఇటీవలి కాలంలో అక్రమ నిర్మాణాలు ఎక్కువ చేస్తున్నారు ? సెలవు దినాల్లో మున్సిపల్ సిబ్బంది అందుబాటులో ఉండరని తెలిసి హడావిడిగా నిర్మాణాలు చేస్తున్నారు. ఈ విషయమై తమకు పలు ఫిర్యాదులు వచ్చాయి. వీరిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు ?

మున్సిపల్ కమిషనర్ : అనుమతి లేని నిర్మాణాలు, సెట్‌బ్యాక్ లేని నిర్మాణాలపై కఠినంగా వ్యవహరిస్తాం. అలాంటి నిర్మాణాల విషయంలో ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు. దీంతో పాటు పలు నిర్మాణాల విషయమై జిల్లా టాస్క్‌ఫోర్స్‌కు నివేదించాం.

ఆంధ్రజ్యోతి: జగిత్యాల యావర్ రోడ్డు అభివృద్ధి మాటేమిటి ?

మున్సిపల్ కమిషనర్ : యావర్ రోడ్డు అభివృద్ధి కోసం కౌన్సిల్ తీర్మానం చేసి కలెక్టర్‌కు నివేదించాం. త్వరలో యావర్ రోడ్డు విస్తరణ విషయమై ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చే అవకాశం ఉంది.

ఆంధ్రజ్యోతి : పట్టణ మాస్టర్ ప్లాన్ ఎప్పుడు చేపడుతారు ?

మున్సిపల్ కమిషనర్ : పట్టణ మాస్టర్ ప్లాన్ విషయమై గతంలో కొన్ని అభ్యంతరాలు రావడం వల్ల నిలిచిపోయింది. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో మాస్టర్ ప్లాన్‌పై సమగ్ర చర్చ జరిగింది. యూఆర్‌డీపీఎఫ్ఐ మార్గదర్శకాలను అనుసరించి రైతులకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా మాస్టర్ ప్లాన్ విధి విధానాలు రూపొందించి టౌన్ ప్లానింగ్‌కు నివేదిస్తాం.

ఆంధ్రజ్యోతి : మున్సిపల్‌లో అవినీతిపై ఆరోపణలపై మీ స్పందన...?

మున్సిపల్ కమిషనర్ : కింది స్థాయి సిబ్బంది అవినీతి విషయమై తమ దృష్టికి కూడా వచ్చింది. అలాంటి వాటిపై చర్యలు ప్రారంభించాం. అవినీతికి పాల్పడేవారిపై తమకు నేరుగాగానీ లేదా ఫోన్ ద్వారాగానీ ఫిర్యాదు చేయవచ్చు. అలాగే ఇలాంటి వారిపై మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేస్తాను. దానిని స్వయంగా నేనే పర్యవేక్షిస్తాను.

పశువైద్య ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు

కలెక్టర్ సత్యప్రసాద్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

8

మల్లికార్జునస్వామి జాతర

బోనాలు సమర్పించిన భక్తులు



ఆలయం వద్ద క్యూలైన్‌లో బారులు దీరిన భక్తులు

7

భూ సేకరణకు రైతులు సహకరించాలి

ఆర్డీవో మధుసూదన్



మాట్లాడుతున్న ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ శేఖర్

6

మైదానంలో నిర్మాణాలకు అనుమతి వద్దు

కొడిమ్యాల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో మిషన్ భగీరథ సంపు నిర్మాణానికి అనుమతి తీర్మాణం ఇవ్వవద్దని కోరుతూ బుధవారం మండల కేంద్రానికి చెందిన పలువురు క్రీడాకారులు గ్రామ కార్యదర్శి వంశీ వర్దన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుకు వినతి పత్రం అందించారు. పాఠశాల మైదానంలో ఏమైనా నిర్మాణాలు చేసినట్లయితే మార్నింగ్ వాకర్స్‌కు, క్రీడాకారులకు ఇబ్బందులు ఎదురవుతాయని వినతి పత్రంలో పెర్కొన్నారు. క్రీడలకు ఉపయోగపడు అభివృద్ధి పనులను చేపట్టాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో సీనియర్ క్రీడాకారులు బల్ల పోచమల్లయ్య, బల్కం అనిల్, నాగార్జున, సాయికుమార్, సుల్తాన్, నాగరాజు తదితరులు ఉన్నారు.

మల్లన్న భక్తుల గోదావరి స్నానాలు

వెల్గటూర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవ క్షేత్రం కోటిలింగాల వద్ద బుధవారం మల్లన్న భక్తులు గోదావరి స్నానాలు ఆచరించారు. మల్లన్న పట్నాలు, బోనాలు తీసే వారు గోదావరి నదిలో స్నానాలు చేసి పవిత్ర గోదావరి జాలాన్ని ఇంటికి తీసుక వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఒగ్గు కళాకారులు పాటలు పాడుతూ మల్లన్న భక్తులను ఉత్సాహ పరిచారు. భక్తులు శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాజ్యాంగబద్ధంగా వర్గీకరణ చేయాలి

ఎస్సీ వర్గీకరణ కమిషన్‌కు మాలమహానాడు వినతి

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): దళిత జాతిని విచ్ఛిన్నం చేసే కుట్రలో భాగంగానే వర్గీకరణ అంశం తెరపైకి వచ్చిందని, ఒకవేళ ప్రభుత్వాలు వర్గీకరణ చేయదల్చుకుంటే అది రాజ్యాంగబద్ధంగా చేస్తేనే ఒప్పుకుంటామని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి, రాష్ట్ర అధ్యక్షుడు జూపాక సుదీర్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు చిత్తారి ప్రభాకర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎస్సీ వర్గీకరణ కమిషన్ చైర్మన్ ఎండీ షమీ అక్తర్ ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన వర్గీకరణపై అభ్యంతరాల స్వీకరణ కార్యక్రమానికి హాజరైన మాల మహానాడు నేతలు వర్గీకరణ చేయవద్దని తమ అభిప్రాయాన్ని లేఖ ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విలువలకు తిలోదకాలు ఇచ్చే విధంగా ఉందని, ఆర్టికల్ 341ను నిబంధనలను తీర్పులో విస్మరించిందన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో రాష్ట్రాలకు వర్గీకరణ అధికారం కట్టబెట్టినట్లుగా భావిస్తున్నామన్నారు. గతంలో కన్నా ఎస్సీల జనాభా పెరిగినందున పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్‌లను పెంచాలని కమిషన్‌కు వివరించారు.

15శాతం ఉన్న రిజర్వేషన్‌లను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. వర్గీకరణ అనేది దేశ వ్యాప్తంగా అమలు చేయాలని కేవలం తెలంగాణ ప్రభుత్వం అత్యుత్సాహంతో మొదలు పెట్టాలని చూస్తే సహించేది లేదన్నారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో వర్గీకరణ ఎందుకు మొదుల చేయడం లేదో కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పార్టీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా వర్గీకరణ ప్రక్రియను తక్షణమే రాష్ట్రంలో నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ బాధ్యులు దాసం రాణి, గిద్దె శంకర్ తదితరులున్నారు.



కమిషన్‌కు నివేదిక అందిస్తున్న మాలమహానాడు బాధ్యులు

ఎన్నికల హామీని సీఎం నిలబెట్టుకోవాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రావణి

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామిని నిలబెట్టుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మెకు ఆమె తన శ్రేణులతో కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీసీసీగా ఉన్న సమయంలో ఈ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని హామి ఇచ్చి, అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఇచ్చిన హామీని నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. జగిత్యాల నియోజకవర్గంలో ఉన్న ఇద్దరు నాయకులు చట్టసభల్లో ఉన్న కానీ సమగ్ర ఉద్యోగుల పక్షాన గొంతు విప్పకపోవడం విచారకరం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ బాధ్యులు రాంరెడ్డి, ఆడెపు నర్సయ్య, రాజేందర్, పవన్‌సింగ్, అశోక్, రమేష్, కళావతి, మమత, రాజగోపాల్, తిరుపతి, గంగారాజం తదితరులున్నారు.

సమగ్ర ఉద్యోగుల వంటా వార్పు

తమ న్యాయమైన డిమాండ్ల సాధనలో భాగంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె బుధవారానికి 9వ రోజుకు చేరింది. రోజువారి నిరసన కార్యక్రమంలో భాగంగా ఖాళీ టీ కప్పులతో నిరసన తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం కలిసి అడుగులు

కేంద్ర మంత్రులను కలిసిన ప్రత్యర్థి పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే



కేంద్ర గిరిజన శాఖ మంత్రి జువల్ ఓరంను కలిసిన ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గానికి పలు అభివృద్ధి పనుల కోసం ఎంపీ ధర్మపురి అర్వింద్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్ కలిసి అడుగులు వేస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమ పనులను సాధించుకోవడానికి బీజేపీ ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే మాకునూరి సంజయ్‌లు ఏకమయ్యారు. ఇటీవల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను న్యూ ఢిల్లీకి ఎంపీ అర్వింద్ తీసుకెళ్లి పలువురు కేంద్ర మంత్రులను స్వయంగా దగ్గర ఉండి కలిపించారు. జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి అవసరమైన పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని, సంక్షేమ కార్యక్రమాలకు సహకరించాలని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి, విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్, కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరం, కేంద్ర గిరిజన శాఖ సహాయ మంత్రి దుర్గాదాస్ ఉకేలను కలిసి వినతిపత్రాలను సమర్పించారు. ప్రత్యర్థ పార్టీల వారైనా కూడా ఇద్దరూ కలిసి స్నేహపూర్వక వాతావరణంలో అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రయత్నాలు చేస్తుండడం రాజకీయ వర్గాలను ఆకర్షిస్తోంది.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ జైపాల్ రెడ్డి

జగిత్యాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు నిబంధనలకు వ్యతిరేకంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవని మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ జైపాల్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని నాలుగు స్కానింగ్ సెంటర్లను సందర్శించారు. కేంద్రాల్లో నిబంధనలు అమలవుతున్న తీరును పరిశీలించారు. పలు మిషనరీ, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో స్కానింగ్ సెంటర్ల పనితీరును పర్యవేక్షించేందుకు కేంద్ర స్థాయి పీసీపీఎన్ డీటీ బృందం ఈ మూడు రోజుల్లో రానున్నట్లు వెల్లడించారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు నిబంధనలకు లోబడి పనిచేయాలని, ఆసుపత్రిలో అందరికి కనబడేలా టారిఫ్ చార్ట్ ప్రదర్శించాలని, లింగ నిర్ధారణ చేయడం శిక్షార్హం అను బోర్డు అతికించాలని సూచించారు. ప్రతి నెల ఫామ్ ఎఫ్ ఆన్‌లైన్‌లో సమర్పించి 5వ తేదీ లోపు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు.. రిజిస్ట్రేషన్ గడువు తీరినట్లయితే కనీసం ఆరు నెలల ముందుగా కార్యాలయంలో రెన్యువల్‌కు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి రాజేశం, కటుకం భూమేశ్వర్, తరాల శంకర్, ఇండివర శ్యామ్ పాల్గొన్నారు.



ప్రైవేటు ఆసుపత్రిలో తనిఖీ చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

కోడిగుడ్డు వడ్డించడం సాధ్యం కాదు

డీఈవోకు మధ్యాహ్న భోజన వర్కర్ల వినతి

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు కోడిగుడ్డు వడ్డించడం సాధ్యం కాదని మధ్యాహ్న భోజన పథకం వర్కర్‌లు పేర్కొన్నారు. మార్కెట్‌లో కోడిగుడ్డు ధర రూ.3 పెరిగినందున ఇంత నష్టంతో విద్యార్థులకు భోజనం వడ్డించడం ఇబ్బందికరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ధరలు పెరిగినందునే ఈ నిర్ణయం తీసుకున్నాం తప్ప మరో ఆలోచన తమకు లేదని పేర్కొంటూ జిల్లా విద్యాశాఖ అధికారికి వారు వినతి పత్రం సమర్పించామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ వంట కార్మికులు శారద, సరస్వతీ, జయశ్రీ, ఏఐటీయూసీ బాధ్యులు వెన్న మహేష్ ఉన్నారు.

అటవీ, దేవాదాయ, వక్ఫ్ భూములను సంరక్షించాలి

కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గల అటవీ, దేవాదాయ, వక్ఫ్ భూములను సంరంక్షించాలని కలెక్టర్ సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్‌లో రెవెన్యూ, ఫారెస్టు, ఎండోమెంట్, ఇరిగేషన్ సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వక్ఫ్ భూములకు సంబంధించి ఎలాంటి వివాదాలు లేనట్లయితే వాటిని దరణిలో నమోదు చేయాలన్నారు. అటవీ భూముల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోవడం అవసరమన్నారు. ఆక్రమణలను నివారించేందుకు ఇతర శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. దేవాదాయ భూముల పరిరక్షణ పై ప్రత్యేక దృష్టి సారించాలని, సంబంధిత భూములను రెవెన్యూ రికార్డులలో నమోదు చేయించాలని సూచించారు. వివిధ భూములపై ఉన్న వివాదాల పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని నిర్ణయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, ఇరిగేషన్, ఎండోమెంట్, ఫారెస్టు, వక్ఫ్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ లత

లబ్ధిదారులకు త్వరలో డబుల్ బెడ్ రూం ఇళ్లు

ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిరుపేదలకు కేటాయించిన నూకపల్లి డబుల్ బెడ్ రూం ఇళ్లను త్వరలో లబ్ధిదారులకు అప్పగిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం నూకపల్లి అర్బన్ కాలనీలో జగిత్యాల పట్టణానికి చెందిన చెట్‌పల్లి కిషన్-విమల దంపతుల గృహ ప్రవేశానికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం ఇళ్ల పాత బకాయిలు, మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం రూ.66 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. గత ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు ఏ నియోజకవర్గంలో కూడా నిర్మించలేదని, జగిత్యాల నియోజకవర్గంలో మాత్రమే 4520 ఇళ్ల నిర్మాణం జరిగిందన్నారు. త్వరలోనే పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లను అప్పగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిరంజీవి, అడువాల లక్ష్మణ్, ఏతం శరణ్, ప్రభాత్‌సింగ్ ఠాకూర్, శ్రీరాం భిక్షపతి పాల్గొన్నారు.

దేశ రక్షణపై ప్రేమతో..

- యువకులు ఆర్మీలో చేరేలా ఉచిత శిక్షణ
- ఉద్యోగ విరమణ పొందిన సైనికుడి ఔదార్యం


యువకులకు శిక్షణ ఇస్తున్న కె కుమార్

కమాన్‌పూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కమాన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన కె కుమార్ చిన్నప్పటి నుంచే ఆటల్లో రాణించేవాడు. ఇంటర్ పూర్తికాగాగే ఆర్మీ సెలక్షన్స్‌కు వెళ్లాడు. హవల్దార్‌గా ఎంపికై నాసిక్‌లోని 162 రెజిమెంట్‌లో శిక్షణ పూర్తిచేశాడు. శ్రీనగర్, జమ్ము-కశ్మీర్, కార్గిల్, లే, నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్, అస్సాం, పంజాబ్, రాజస్థాన్ లాంటి ప్రాంతాల్లో విధులు నిర్వహించాడు. అస్సాంలో రెండుసార్లు ఉల్ఫా ఉగ్రవాదులతో, శ్రీనగర్‌లో ఒకసారి ఖలిస్థాన్ తీవ్రవాదులతో జరిగిన భీకర పోరులో పాల్గొని త్రుటిలో ప్రాణపాయం నుంచి తప్పించుకున్నాడు. కుమార్ మంచి క్రీడకారుడు కూడా. ఆర్మీ తరఫున బాక్సింగ్‌లో నేషనల్ టీమ్‌కు ఆడాడు. కుమార్ హాకీ పోటీల్లోనూ రాణించాడు. పదేహారేండ్ల సైనిక సేవ తర్వాత 2018లో ఉద్యోగ విరమణ పొందాడు.

● రిటైర్ అయినా..

ఉద్యోగ విరమణ పొందినా దేశరక్షణపై ప్రేమతో ఆర్మీ ఉద్యోగానికి సన్నద్ధమవుతున్న యువతకు శిక్షణ ఇస్తున్నాడు. రిటైర్ అయినా కుమార్ చొప్పదండిలోని రుక్మాపూర్ క్రీడ పాఠశాలలో ఫిజికల్ ఇన్‌స్ట్రక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. క్రీడా శిక్షణ ఇస్తూనే విద్యార్థులను శారీరకంగా రాటుదేలేలా తర్ఫీదునిస్తున్నాడు. నిత్యం వ్యాయామం, జాగింగ్ చేయిస్తూ యువత ఆర్మీలో చేరేలా ప్రోత్సహిస్తున్నాడు. కమాన్‌పూర్, చొప్పదండి ప్రాంతాల్లో ఆర్మీకి సిద్ధమవుతున్న యువకులకు మెళకువలు నేర్పుతున్నాడు. మరోవైపు అంబేద్కర్ సేవా సమితి పేరిట క్రీడా పోటీలు నిర్వహిస్తున్నాడు. ఆర్థికంగా వెనుకబడిన యువకులకు అండగా నిలుస్తున్నాడు.

దేశ ప్రజలకు సేవలందించడమే లక్ష్యం..

- మైనేని మధుకుమార్, అస్సాం రైఫిల్స్



దేశ ప్రజలకు సేవలందించడమే లక్ష్యంగా ఆర్మీ ఉద్యోగానికి లక్ష్యంగా పెట్టుకున్న సమయంలో రుక్మాపూర్ క్రీడ పాఠశాలలో పనిచేస్తున్న కుమార్‌తో పరిచయం ఏర్పడింది. ఆయన సూచనలు నాలో ఉత్సాహం నింపాయి. ఆయన ఇచ్చిన ట్రైనింగ్‌తో మూడు సంవత్సరాల వ్యవధిలోనే అస్సాం రైఫిల్స్‌లో హవల్దార్‌గా ఎంపిక అయ్యాను.

సరైన ట్రైనింగ్‌తోనే ఉద్యోగం..

- పవన్ కల్యాణ్, ఆర్మీ ఉద్యోగి, పెద్దపల్లి



నాకు చిన్నప్పటి నుంచి ఆర్మీలోకి వెళ్లాలని చాలా కోరిక ఉండేది. కానీ డబ్బులు ఇచ్చి కోచింగ్ తీసుకోలేకపోతున్నందుకు బాధపడేవాడిని. కుమార్‌సార్ ఉచితంగా కోచింగ్ ఇస్తున్నారని తెలుసుకొని ఆయనను కలిశాను. ఆయన సహకారంతో ఆర్మీలో ఉద్యోగం సాధించాను.

పేద విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇస్తున్నా..



- వాసాల రమేష్, కోచ్

ఆర్మీ ఉద్యోగమే లక్ష్యంగా పెట్టుకున్న నిరుపేద యువతకు ఉచితంగా కోచింగ్ ఇచ్చేందుకు కుమార్ అకాడమి ఇన్‌చార్జీగా, కోచ్‌గా పనిచేస్తున్నాను. ఆర్మీ ఉద్యోగానికి సన్నద్ధమయ్యేందుకు ఆర్థికంగా డబ్బులు లేని యువతకు ఉచితంగా కోచింగ్ ఇస్తున్నాం.

యువతను సన్మార్గంలో నడిపించేందుకే..

- కె. కుమార్, రిటైర్డు ఆర్మీ ఉద్యోగి, కమాన్‌పూర్



మంచిర్యాలలో ఎస్‌బీఐ గార్డ్ డ్యూటీ చేస్తూనే ఉచితంగా పలువురు యువకులకు ఆర్మీ కోచింగ్ ఇస్తున్నాను. నిరుపేద యువతను సైన్యం వైపు వెళ్లేలా చేసేందుకు కృషి చేస్తున్నా. నాతో పాటు ముగ్గురు కోచ్‌లు, ఇద్దరు టీచర్లు ఉన్నారు. వారి సహకారంతో మూడేళ్ల నుంచి యువతకు ఆర్మీ శిక్షణ ఇస్తున్నాను.

దాబాపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామ శివారులో కేసారి శ్రీనివాస్ అనుమతి లేకుండా నిర్వహిస్తున్న దాబాపై టాస్క్‌ఫోర్స్ సీఐ సదన్‌కుమార్ ఆధ్వర్యంలోని పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. నిల్వ చేసిన 67 వేల రూపాయల విలువైన మద్యం సీసాలను స్వాధీనపర్చుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిర్వాహకుడు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశామని పోలీసు అధికారులు వెల్లడించారు. జిల్లాలో దాబాలు, హోటళ్లలో అక్రమంగా సిట్టింగ్‌లు నిర్వహించి మద్యం అమ్మకాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సదన్‌కుమార్ హెచ్చరించారు. దాడుల్లో ఎస్‌ఐ సుధాకర్, శిక్షణ ఎస్‌ఐ లక్ష్మణ్, సిబ్బంది తిరుపతి, రాజేశ్ పాల్గొన్నారు.


200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

ఎల్లారెడ్డిపేట డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్, గుండారం గ్రామాల్లోని గిరిజన తండాలపై ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలోని సిబ్బంది, టాస్క్‌ఫోర్స్ అధికారులు సంయుక్తంగా బుధవారం దాడులు నిర్వహించారు. సారా తయారీ కేంద్రాలను కనుగొన్నారు. నిల్వ చేసిన 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. రవాణాకు సిద్ధంగా ఉన్న ఐదు లీటర్ల నాటు సారా, తయారీకి వినియోగించే 20 కిలోల బెల్లాన్ని స్వాధీనపరుచుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని సిఐ శ్రీనివాస్ వివరించారు.

పీఎం కిసాన్ లింకుతో ముగ్గురి ఫోన్లు హ్యాక్

గన్నేరువరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు పంపించిన పీఎం కిసాన్ లింకుతో మండలంలో ముగ్గురి వ్యక్తుల ఫోన్‌లు బుధవారం హ్యాక్‌కు గురయ్యాయి. మండల కేంద్రానికి చెందిన బూర వెంకటేశ్వర్ ఫోన్ హ్యాక్ గురై తన పేరుతో మండలంలోని పలు వాట్సాప్ గ్రూపుల్లో పీఎం కిసాన్ లింక్ పంపినట్లు వచ్చింది. లింక్‌ను అదే గ్రామానికి చెందిన బోయిన శ్రీనివాస్, మైలారం గ్రామానికి చెందిన కాదసి కుమారస్వామి లింక్‌ను ఓపెన్ చేశారు. ఫోన్‌లో వాట్సాప్, ఫోన్‌పే, గూగుల్‌పే, ఇతర యాప్‌లు పనిచేయకపోవడంతో తమ ఫోన్‌లు హ్యాక్‌కు గురయ్యాయని గుర్తించారు. విషయాన్ని బ్యాంక్ అధికారులకు తెలిపి వారి ఖాతాలను హోల్డ్‌లో పెట్టించారు. వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సైబర్ మోసాలకు గురైతే 1930టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదుచేయాలని ఎస్‌ఐ నరేష్ సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి


రాములు(ఫైల్)

రుద్రంగి, డిసెంబరు, 18 (ఆంధ్రజ్యోతి) రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందగా మరోకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన రుద్రంగి మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలోని ప్రదాన రహదారిపై బుదవారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిసిన వివరాల ప్రకారం.. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన కంటే రాములు(70) అనే వ్యక్తి కేడీసీసీ బ్యాంక్ నుంచి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. బస్టాండ్ వద్ద యూ టార్న్ తీసుకుంటున్న సమయంలో ఇదే గ్రామానికి చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బాలుడు ఇందిరాచౌక్ చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వైపు ద్విచక్ర వాహనంపై అతివేగంగా వెళ్తూ రాములు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో రాములు తలకు తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమద్యలో రాములు మృతి చెందాడు. బాలుడికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడు రాములు కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సిరిసిల్ల ఆశోక్ తెలిపారు.

లారీ, ద్విచక్రవాహనం ఢీకొని.. ముగ్గురికి తీవ్రగాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థులు

సుల్తానాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ పరీక్షలు కోసం వెళుతున్న విద్యార్థులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ద్విచక్ర వాహనంపై వెళుతూ లారీని ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పెద్దపల్లి ప్రగతినగర్‌కు చెందిన వల్లెపు జాన్ ప్రకాష్, కరుణాకర్, సుల్తానాబాద్‌కు చెందిన కొయ్యడ భాను ద్విచక్ర వాహనంపై కరీంనగర్ వెళుతున్నారు. సుల్తానాబాద్ మండలంలోని దుబ్బపల్లి వద్ద యూ టర్న్ తీసుకుంటున్న లారీని ద్విచక్రవాహనంపై వెళుతున్న యువకులు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న జాన్ ప్రకాష్‌తో పాటు కరుణాకర్, కొయ్యడ భాను కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని 108 అంబులెన్స్ ద్వారా కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న జాన్‌ప్రకాష్ ప్రస్తుతం పరీక్షలు రాస్తున్నాడు. బుధవారం పరీక్ష ఉండడంతో పెద్దపల్లి నుంచి ఉదయం ఏడుగంటల ప్రాంతంలో కరుణాకర్‌తో కలిసి కరీంనగర్ బయలుదేరారు. మార్గమధ్యలో సుల్తానాబాద్‌లో వారి స్నేహితుడు కొయ్యడ భానును కూడా ఎక్కించుకుని పరీక్షలు రాయడానికి కరీంనగర్ బయలుదేరగా దుబ్బపల్లి వద్ద ప్రమాదం జరిగింది. జాన్ ప్రకాష్ తల్లి జ్యోతి ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు

సారంగాపూర్, డిసెంబరు, 18 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ అటవీ ప్రాంతంలో బైక్ అదుపుతప్పి ఓ యువకుడు బుధవారం గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బట్టపెల్లి గ్రామానికి చెందిన దాసరి సునీల్ అనే యువకుడు జగిత్యాల నుంచి తన బైక్ పై బట్టపెల్లికి వస్తున్న క్రమంలో సారంగాపూర్ అటవీ ప్రాంతంలో రాత్రి సమయంలో ఒక్కసారిగా బైక్ అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టాడు. దీంతో సునీల్ తీవ్ర గాయాలతో రోడ్డుపై పడిపోయాడు. గమనించిన వాహన దారులు అంబులెన్స్ సహాయంతో జగిత్యాల ఆస్పత్రికి తరలిలించారు.

దుబాయ్‌లో బస్సు బోల్తా.. మల్లాపూర్ వాసి మృతి

మల్లాపూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలానికి చెందిన మాణాల అశోక్(48) నాలుగు రోజుల క్రితం దుబాయ్‌లో జరిగిన బస్సు ప్రమాద సంఘటనలో తీవ్ర గాయాల పాలై చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. అశోక్ జీవనోపాధి కోసం గతంలో బెహ్రాయిన్ దేశం వెళ్లి తిరిగి సంవత్సరం కింద ఇంటికి వచ్చాడు. మళ్లీ నాలుగు నెలల కిందట దుబాయ్ వెళ్లాడు. దుబాయ్‌లో ఈనెల 15 రాత్రి బస్సు బోల్తా పడ్డ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. చికిత్స పొందుతున్న అశోక్ బుధవారం మృతి చెందాడు. అశోక్‌కు భార్య లక్ష్మి, కుమార్తెలు భావన, సాయిహర్షిని, సాయికీర్తనలు ఉన్నారు.

పవర్‌లూం కార్మికుడి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన కర్దాతం శ్రీనివాస్ (46) అనే పవర్‌లూం కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం... బీవైనగర్‌కు చెందిన శ్రీనివాస్ పవర్‌లూం కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఏడునెలలుగా పనిలేక అనారోగ్యం పాలై మద్యానికి అలవాటు పడి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. అనారోగ్యంతో ఉన్న కార్మికుడు ఇంట్లోనే ఓ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని బలవన్మరణానికి ఒడిగట్టాడు. శ్రీనివాస్‌కు రెండు పెళ్లిల్లు అయినప్పటికీ భార్యలు వెళ్లిపోయారు. తండ్రి 20 సంవత్సరాల క్రితమే మృతిచెందడంతో శ్రీనివాస్ తల్లితో పాటు ఉంటున్నాడు. ఏడు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సిఐ కె కృష్ణ తెలిపారు.

వేములవాడలో యువకుడి దారుణ హత్య

- 25 చోట్ల కత్తిపొట్లు - వివాహేతర సంబంధమే హత్యకు దారి తీసిన వైనం - పోలీసుల అదుపులో నిందితుడు


మృతుడు రషీద్ (ఫైల్), విచారణ జరుపుతున్న పోలీసులు

వేములవాడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వివాహే తర సంబంధం కొనసాగిస్తున్నాడన్న కారణంతో ఓ యువకుడిని సినీ ఫక్కీలో వేటాడి.. వెంటాడి దారుణంగా హత్య చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకున్న సంఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. జిల్లాలోని వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామానికి చెందిన మహమ్మద్ రషీద్ (35) గతంలో వేములవాడలో నివసించేవాడు. ప్రస్తుతం గంగాధరలో డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. రషీద్ వేములవాడ పట్టణానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయంలో ఏడాది క్రితమే ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరిగాయి. మహిళ భర్త గల్ఫ్‌లో ఉంటున్న నేపథ్యంలో రషీద్ ఆమెతో సన్నిహితంగా ఉంటూ వస్తున్నాడు. ఇరువురి మధ్య వివాహేతర సంబంధం విషయంలో జరిగిన గొడవలు పోలీస్ స్టేషన్ వరకు వెళ్లాయి. తనకు భర్తతో కలిసి ఉండడం ఇష్టం లేదంటూ ఆమె ఇటు అత్తగారింటికి, అటు తల్లిగారింటికి వెళ్లడం లేదు. వేములవాడ పట్టణంలోని అర్బన్ కాలనీలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ రషీద్‌తో సన్నిహిత సంబంధం కొనసాగిస్తోంది.

● గల్ఫ్ నుంచి వచ్చి..

మరో వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న భార్య తీరుపై ఆగ్రహంతో ఉన్న భర్త నెల రోజుల క్రితం గల్ఫ్ నుంచి తిరిగి వచ్చాడు. రషీద్‌ను ఎలాగైనా అంతమొందించాలనుకున్నాడు. మంగళవారం రాత్రి తన భార్య ఉంటున్న న్యూ అర్బన్ కాలనీలోని ఇంటికి రషీద్ వచ్చినట్లు తెలుసుకొని రాత్రంతా అక్కడే మాటు వేశాడు. బుధవారం తెల్లవారుజామున రషీద్ బయటకు రావడంతోనే కత్తితో దాడి చేశాడు. తప్పించుకునేందుకు రషీద్ సుమారు 300 నుంచి 400 మీటర్లు వరకు పరుగెత్తాడు. తనను చంపుతున్నారని కాపాడాలంటూ సమీప బంధువులకు ఫోన్ చేశాడు. ఈలోగానే వివాహిత భర్త వెంటపడి దాడి చేసి అత్యంత కిరాతకంగా నరికి చంపాడు. సంఘటనస్థలానికి చేరుకున్న బంధువులు రషీద్‌ను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రషీద్‌ను హత్య చేసే క్రమంలో వివాహిత భర్త మృతుడి తలపై 15 చోట్ల, శరీరంపై మరోపది చోట్ల కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలైనట్లు పోలీసులు గుర్తించారు. మృతుడు రషీద్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. హత్య చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలంటూ రషీదు కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. వేములవాడ పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్, ఎస్బీ విభాగం డీఎస్పీ మురళీకృష్ణ, ఎస్సైలు రమేష్, మారుతి సంఘటన స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. హత్యకు పాల్పడిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. మృతుడి బంధువుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కమ్మ కత్తితో ఒకరిపై దాడి

- కాలువ నీటి విషయంలో గొడవ

చందుర్తి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమి వద్ద కాలువ నీరు విషయంలో ఒకరిపై ఒకరు కమ్మ కత్తితో దాడి చేసిన సంఘటన చందుర్తి మండలం ఎనగల్ గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన మారుపాక నర్సయ్యపై అదే గ్రామానికి చెందిన రాజేశం అనే వ్యక్తి కాలువ నీటి విషయంలో గొడవ పడ్డారు.

రాజేశం కమ్మ కత్తితో దాడి చేయడంతో నర్సయ్యకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 వేములవాడలోని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

తాగి వచ్చిన భర్తను చితకబాదిన భార్య

- దెబ్బలకు తాళలేక మృతి

కొడిమ్యాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని పూడూర్ గ్రామంలో నిత్యం మద్యం తాగి వచ్చి గొడవకు దిగుతున్న భర్తను భార్య చితకబాదింది. ఆ దెబ్బలకు తాళలేక భర్త బుధవారం ఉదయం మృతి చెందాడు. కొడిమ్యాల ఎస్సై సందీప్ తెలిపిన వివరాల మేరకు పూడూర్ గ్రామానికి చెందిన పెద్ది రాజశేఖర్(33)కు నర్మదకు ఆరేళ్ల క్రితం వివాహం అయింది. వీరికి ఒక కూతురు, కొడుకు ఉన్నాడు. రాజశేఖర్ కొద్ది రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. నిత్యం మద్యం తాగి వచ్చి ఇంట్లో భార్య నర్మద, తల్లి కొమురవ్వపై దాడి చేసేవాడు. మంగళవారం రాత్రి కూడా తాగి ఇంటికి వచ్చి తల్లి, భార్యతో గొడవ పడ్డాడు. దీంతో భార్యతో పాటు తల్లి రాజశేఖర్‌ను తీవ్రంగా కొట్టారు. అనంతరం నర్మద తమ్ముడు మహేందర్ కు రాత్రి విషయం తెలుపడంతో ముగ్గురూ కలిసి రాజశేఖర్‌ను బాత్రూంలో వేసి తాళం వేశారు. బుధవారం ఉదయం బాత్రూంలో చూసేసరికి అప్పటికే చనిపోయి ఉన్నాడు. మృతుడి తండ్రి పెద్ది మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భూ సేకరణకు రైతులు సహకరించాలి

- ఆర్డీవో మధుసూదన్

వెల్గటూర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్రం గ్రీన్ ఫీల్డ్ హైవే పేరిట చేపట్టిన జాతీయ రహదారి 63 విస్తరణకు చేపట్టిన భూ సేకరణకు రైతులు సహకరించాలని ఆర్డీవో మధుసుదన్ కోరారు. బుధవారం వెల్గటూర్ మండల పరిషత్ కార్యాలయంలో రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ నుంచి జగిత్యాల మీదుగా మంచిర్యాల వరకు ఎన్‌హెచ్-63 విస్తరణ పనుల్లో భాగంగా మండలంలోని స్తంభంపల్లి, కొత్తపెల్లి గ్రామాల్లో 40 మంది రైతులు 33 ఎకరాలు భూములు కోల్పోతున్నారని తెలిపారు. మొదటి విడతలో 21 ఎకరాలు కోల్పోతున్న రైతులకు నోటీసులు అందజేశామని వారు స్టేట్‌మెంట్ ఇచ్చారని తెలిపారు.

అదనంగా మరో 12 ఎకరాలు కోల్పోతున్న రైతులకు ఇటీవలే నోటీసులు అందజేశామన్నారు. రైతులకు ఏమన్నా అభ్యంతరాలు ఉంటే తెలుసుకోవడానికి సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులకు నష్టపరిహారం అందజేస్తామన్నా రు. ప్రభుత్వం అందజేసే పరిహారం నచ్చకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ కొంత మేరకు పరిహారం పెంచే అవకాశం ఉంటుందని సూచించారు. తన స్థాయిలో రైతులు నష్టపోకుండా చూస్తానని అన్నారు.

● భూములు తీసుకొని పొట్ట కొట్ట వద్దు

రోడ్డు విస్తరణ పనుల పేరిట భూములు తీసుకొని తమ పొట్ట కొట్టవద్దని రైతులు మండిపడ్డారు. ఇప్పటికే శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పేరిట భూములు కోల్పోయామని వాపోయారు. ఉన్న కాస్త భూములు సాగు చేసుకుంటూ బతుకుతుంటే ఇప్పుడు గ్రీన్ ఫీల్డ్ హైవే పేరిట రోడ్డు విస్తరణకు భూములు తీసుకుంటే ఎలా బతకమంటారని అధికారులను ప్రశ్నించారు. భూములు ఎట్టి పరిస్థితిలో ఇవ్వమని తెగేసి చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేఖర్, ఎంపీవో శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తి అరెస్టు


అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజు

మంథని/ముత్తారం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముత్తారంలో గంజాయి మొక్కలు పెంచుతున్న రేపాల గట్టయ్య అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు మంథని సీఐ రాజు బుధవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తారం ఎస్‌ఐ నరేష్‌కు అందిన సమాచారం మేరకు ఏవోతో కలిసి వెళ్లి రేపాల మల్లయ్య ఇంటి అవరణలో 12 గంజాయి మొక్కలు సాగు చేస్తున్నట్లు గుర్తించారన్నారు. ఎస్‌ఐ నరేష్ ఆ మొక్కలను స్వాధీనం చేసుకొని గట్టయ్యను పోలీసు స్టేషన్‌కు తరలించారన్నారు. కేసు నమోదు చేసిన అరెస్టు చేసి మంథని కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కల విలువ రూ.1.20 లక్షలు ఉంటుందని తెలిపారు. మంథని పోలీసు సర్కిల్ పరిధిలోని మంథని, ముత్తారం, రామగిరి మండలాల్లో ఎవరైన నిషేధిత గంజాయి అమ్మినా కొన్నా, ఉపయోగించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బోరు బావుల తవ్వకాలకు భూమి పూజ

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పలు ఆలయాల్లో బోరుబావుల తవ్వకానికి బీజేపీ నాయకులు బుధవారం భూమి పూజ చేశారు. మడేలేశ్వరస్వామి ఆలయం ఆవరణ, శ్రీ వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన వ్యవసాయ భూమిలో బోరు బావుల తవ్వకానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ సంజయ్‌కుమార్ నిధులు కేటాయించారు. నీటి వసతి కల్పించేందుకు నిధులు కేటాయించిన బండి సంజయ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోపి, తిరుపతి, లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, నరేశ్, రమేశ్, రాంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాజిరెడ్డి, కిరణ్, వేణు, నర్సయ్య, పోచయ్య, హన్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సింగిరెడ్డి నరేష్‌రెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేష్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ గల్ఫ్ వలసదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నరేష్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఆరోగ్యకరమైన వలసలు సమాజ శ్రేయస్సుకి, అభివృద్ధికి దోహదపడతాయన్నారు. సంస్కృతి ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి చేరువకావడానికి వలసలు దోహదపడతాయన్నారు. అనంతరం గల్ఫ్ జేఏసీ అధ్యక్షుడు గుగ్గిల్ల రవిగౌడ్ మాట్లాడుతూ వలసదారుల ద్వారా దేశ ఖజానాకు ఆర్థిక వనరులు సమకూరుతున్నా ప్రభుత్వాలు మాత్రం వలసదారులపై అవలంబించే విధానాలు మారకపోవడం దురదృష్టకరం అన్నారు. తెలంగాణ ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి కృషి చేయడం అభినందనీయం అన్నారు. కేంద్రప్రభుత్వం సైతం గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి తోడ్పాటును అందించాలని కోరారు. కార్యక్రమంలో మంద భీంరెడ్డి, ఎల్లాల శ్రీనివాస్ రెడ్డి, బూట్కూరి కాంతక్క, మధు, పల్లికొండ ప్రవీణ్, తిరుపతి, రాజిరెడ్డి, చంద్రశేఖర్, తిరుపతి, నాగరాజు తదితరులు ఉన్నారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

ఇల్లందకుంట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన బొమ్మ రవి అనే గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రవి వృత్తిలో భాగంగా బుధవారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కుతుండగా మోకు జారీ ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు హుటాహుటిన జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సర్వాయి పాపన్న జిల్లా ప్రధాన కార్యదర్శి దొమ్మటి రాజమల్లుగౌడ్, మండలాధ్యక్షుడు దేవేందర్‌గౌడ్ రవిని పరామర్శించారు. నిరుపేద కుటుంబానికి చెందిన రవిని ప్రభుత్వం వెంటనే ఆర్థిక సాయం అందజేసి ఆదుకోవాలని కోరారు.

అక్రమంగా మట్టి తరలించిన వ్యక్తిపై కేసు నమోదు

గన్నేరువరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా కెనాల్ మట్టిని తరలించిన ఎక్స్‌కావేటర్ యజమానిపై కేసు నమోదు అయింది. ఎస్‌ఐ తాండ్ర నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామానికి చెందిన పొన్నాల మధు మంగళవారం రాత్రి అక్రమంగా గ్రామశివారులోని కెనాల్ మట్టిని తవ్వి తన పొలంలో పోసుకుని చదును చేస్తుండగా గ్రామస్థులు అడ్డుకుని ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. ఇరిగేషన్ ఏఈఈ మహేందర్ ఫిర్యాదు మేరకు అక్రమంగా మట్టిని తరలించడమే గాకుండా అడ్డుకున్న గ్రామస్థులను బెదిరించాడని పొన్నాల మధుపై కేసు నమోదు చేశామని, ఎక్స్‌కావేటర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక కుప్పల స్వాధీనం

కోరుట్ల రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అక్రమ ఇసుక నిల్వలతో పాటు రెండు ఇసుక ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. గ్రామ శివారులోని అక్రమంగా నిల్వ ఉన్న 50 ఇసుక కుప్పలను అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌ఐ రాజేందర్ రావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గ్రామ శివారులో ఉన్న ఇసుక నిల్వలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అదే సమయంలో కల్లూర్ గ్రామం నుంచి కోరుట్లకు అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను అధికారులు పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. సీజ్ చేసిన ఇసుక కుప్పలను త్వరలో వెలం వేయనున్నట్లు తహసీల్దార్ కిషన్ తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

వేములవాడ టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని పట్టుకుని సీజ్ చేసి ఆర్టీసీ డిపోకు తరలించినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోయినపల్లి మండలానికి చెందిన ఓ ఇసుక లారీ వేములవాడ నందికమాన్ మీదుగా కామారెడ్డి వెళ్తున్న సమయంలో పోలీసులు పట్టుకున్నారు. ప్రభుత్వ అనుమతులకు లోబడి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో లారీని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా మూడు రోజుల క్రితం మరో రెండు ఇసుక లారీలు అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. వే బిల్‌లో లారీ నంబర్ ఒకటి ఉంటే లారీ ట్రాలీపైన వేరే నంబర్‌తో జోరుగా ఇసుక దందా జరుగుతుండటంతో సంబంధిత అధికారులు అట్టిముట్టనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడివారిపై చర్యలు తీసుకుని అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

వైభవంగా సంకటహర చతుర్థి పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి అనుబంధ రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద గల గణపతి ఆలయంలో సంకటహర చతుర్థి పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభిషేక్ పౌరోహితులు బొజ్జ రాజగోపాల్ శర్మ, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథ్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య అభిషేకం, విశేష పూజలు, హారతి, మంత్రపుష్పం నిర్వహించారు. గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : డిపో పరిధిలోని ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా సర్వీసులను నడపాలని టీజీఎస్ ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కుష్రోస్ షా ఖాన్ అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని డిపోను సందర్శించారు. డిపో నుంచి నడిపే బస్సు రూట్ల వివరాలను తెలుసుకున్నారు. టీజీఎస్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రాజు, డిప్యూటీ ఆర్ఎం(వో)భూపతిరెడ్డి, సిరిసిల్ల డిపో మేనేజర్ ప్రకాష్ ఉన్నారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

జగిత్యాల అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కొడిమ్యాల కానిస్టేబుల్ కల్యాణ్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ అశోక్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ఓ కేసు విషయంలో కోర్టును తప్పుదోవ పట్టించాడనే ఆరోపణపై విచారణ నిర్వహించిన పోలీసులు ఆరోపణ రుజువు కావడంతో సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఇదే విషయమై సదరు కానిస్టేబుల్‌పై జగిత్యాల పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు అయినట్లు పట్టణ సీఐ వేణుగోపాల్ తెలిపారు.

హాకీ @హుజూరాబాద్

హుజూరాబాద్‌లో హాకీ ఆడుతున్న క్రీడాకారులు



హాకీతో హుజూరాబాద్‌కు ప్రత్యేక అనుబంధం ఉంది. 60 ఏళ్ల క్రితం చిన్నగా మొదలైన ప్రయత్నం నేడు ఎంతో మందిని క్రీడాకారులను చేసింది. ఇక్కడి క్రీడాకారులు జాతీయస్థాయిలో గుర్తింపు పొందారు. వారిని స్ఫూర్తిగా తీసుకున్న స్థానిక యువకులు క్రీడలో నైపుణ్యం పొంది రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. పూర్తి స్థాయిలో సౌకర్యాలు లేకున్నా ఉన్న వనరులతో ఆట నేర్చుకుని హుజూరాబాద్ పట్టణానికే ప్రత్యేక గుర్తింపు తెచ్చారు.

- క్రీడతో 60 ఏళ్ల అనుబంధం
- ప్రతిభ చాటుతున్న క్రీడాకారులు
- శిక్షణతో మరింత మంది ముందుకు

హుజూరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హాకీ క్రీడకు హుజూరాబాద్ చిరునామాగా మారింది. ఎంతో మంది క్రీడాకారులు ఇక్కడ ఆట నేర్చుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు.ఇటీవల మధ్యప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి అండర్-14 బాల బాలికల క్రీడల్లో తెలంగాణ రాష్ట్రం తరుపున హుజూరాబాద్ క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిరోజు హైస్కూల్ మైదానంలో సీనియర్ క్రీడాకారులు యువతకు శిక్షణ ఇస్తున్నారు. హాకీ క్రీడల క్లబ్ అధ్యక్షుడిగా తోట రాజేంద్రప్రసాద్, కార్యదర్శిగా గుడ్డెల్లుల సమ్మయ్యలు వ్యవహరిస్తున్నారు. వీరితో పాటు కొలిపాక శ్రీనివాస్, బండ శ్రీనివాస్, గనిశెట్టి ఉమయ్యలు ప్రస్తుతం క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు.

● హాకీవైపు అడుగులు

హుజూరాబాద్‌కు హాకీ క్రీడలకు విడదీయలేని అనుబంధం ఉంది. 60ఏళ్ల క్రితం హైస్కూల్‌లో జి. పాండురంగచారి ఉపాధ్యాయుడిగా పనిచేశారు. అతనికి హాకీపై మక్కువ ఉండేది. ఈ క్రమంలో స్కూల్ విద్యార్థులతో పాటు స్థానిక యువతకు క్రీడల వైపు దృష్టి మళ్లించాడు. ఆయన కృషితోనే హాకీ క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఉన్నత స్థాయికి ఎదిగారు. మొదట్లో రాజారి రాములు, కృష్ణమూర్తి, శంకర్, సత్తయ్య, రామవులు, శేఖరయ్య, మిఠాయి రాములు, శ్రీశైలం, రమణయ్య, సత్యనారాయణ, ఆఫీస్, ఉస్మాన్‌ఖాన్, అలీ, నవాజ్, ముస్తాక్, హుస్సేన్, వర్జిర్‌అహ్మద్, తుపాకుల మొగిలయ్య, కందుల ఆదిరెడ్డి, నల్ల సుధాకర్‌రెడ్డి, బిక్షపతి, లక్ష్మినారాయణ, మోటపోతుల రమేష్, తాళ్లపల్లి సమ్మయ్య, మోహన్‌లాల్ లాంటి వారు 11మంది జట్టు గా హాకీ ఆడేవారు. ఆ తర్వాత వారి పిల్లలతో పాటు మరికొంత మంది హాకీ క్రీడాకారులు తయారయ్యారు. ఇక్కడి నుంచే హాకీ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని ప్రభుత్వ ఉద్యోగాల్లో కూడా స్థిరపడ్డారు. వారి పిల్లలతో పాటు కొత్తగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు హాకీ క్రీడల్లో పాల్గొంటున్నారు. ఒక మోటపోతుల రమేష్ కుటుంబంలో నలుగురు కుమారులు హాకీ క్రీడల్లో గుర్తింపు పొందారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో తిరణహరి శ్రీనివాస్ అనే హాకీ క్రీడాకారుడు 15ఏళ్లుగా విద్యార్థులకు కోచింగ్ ఇస్తున్నారు. ఇటీవల హుజూరాబాద్‌లో రాష్ట్రస్థాయి హాకీ క్రీడలు జరగగా, కరీంనగర్ జట్టు గెలవగా, అందులోని క్రీడాకా రులు హుజూరాబాద్‌కు చెందిన వారే కావడం విశేషం.

● ఎందరో ప్రతిభావంతులైన క్రీడాకారులు

హుజూరాబాద్ హాకీ మైదానంలో ప్రతిబావంతులైన క్రీడాకారులు నేటితరంలో ఎందరో ఉన్నారు. అందులో మాటూరి కిరణ్, జగదీష్, సన్ని, నితిన్‌రెడ్డి, పవన్, సుమలత, రజిత, వైష్ణవి, వినిత్, విపుల్, వినయ్, నాగరాజు, రిషిత, సాజిత్, అరుణ్‌కుమార్, నిమ్మటూరి మిథున, రోహన్, రుత్విక్, మేఘన, దత్తాత్రేయ, శివసం తోషిని, రామచరణ్, గోలి నిపునిత, సంజయ్ సబ్ జానియర్ జాతీయ పోటీల్లో తెలంగాణ జట్టు తరుపున ఆడి గుర్తింపు పొందారు.



జాతీయ స్థాయి హాకీ పోటీల్లో ఆడాను

- గాజ వెంకటేష్, హాకీ క్రీడాకారుడు, హుజూరాబాద్

హుజూరాబాద్ హైస్కూల్ మైదానంలో హాకీ నేర్చుకున్నా. హుజూరాబాద్ తరుపున సబ్ జూనియర్, నేషనల్ జూనియర్స్, సీనియర్స్‌లో వరుసగా మూడుసార్లు జాతీయ స్థాయి హాకీ క్రీడల్లో ఆడాను. హాకీతో నాకు ప్రభుత్వ ఉద్యోగం లభించింది. ప్రస్తుతం ముంబైలోని నేవీలో పని చేస్తున్నా.

అండర్-14 జాతీయస్థాయి హాకీ క్రీడల్లో ఆడాను

- నిమ్మటూరి మిథున, హాకీ క్రీడాకారు, హుజూరాబాద్

ఇటీవల హుజూరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో పాల్గొన్నాను. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో మధ్యప్రదేశ్‌లో జరి గిన అండర్-14 ఎస్ఎఫ్ జాతీయ స్థాయి హాకీ టోర్న మెంట్‌లో పాల్గొ న్నాను. హుజూరాబా ద్‌లో సీనియర్ క్రీడాకారుల ప్రోత్సా హంతో రాణిస్తున్నాను.

క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాను.

- మాటూరి రాజేష్, క్రీడాకారుడు, హుజూరాబాద్

2000సంవత్సరంలో గుజరాత్‌లోని గాంధీనగర్ రూరల్‌లో జరిగిన జాతీయ స్థాయి హాకీ పోటీల్లో పాల్గొన్నాను. క్రీడా కోటాలో ఉద్యోగం సాధించి ములుగు జిల్లాలో జిల్లా కో-ఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో ఆడిటర్‌గా పనిచేస్తున్నాను. ప్రస్తుతం ఆలిండియా సివిల్ సర్వీస్ సెక్ర టేరియట్ తెలంగాణ టీమ్‌లో ఆడుతున్నాను.

ఎన్టీపీసీ ప్రజాభిప్రాయ సేకరణ మరోసారి వాయిదా

జ్యోతినగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ ఆధ్వర్యంలో నిర్మించ నున్న తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు (టీఎస్‌టీపీపీ) స్టేజ్-2కు సంబంధించి గురువారం నిర్వహించాల్సిన ప్రజాభిప్రా య సేకరణ మరోసారి వాయిదా పడింది. నవంబర్ 29న మొదటిసారి ప్రజాభిప్రాయ సేకరణ జరగాల్సి ఉండగా జిల్లాలో సీఎం పర్యటన కారణంగా వాయిదా పడింది. ఈ క్రమంలో గురువారం నిర్వహించాల్సిన పబ్లిక్ హియరింగ్ మరో సారి వాయిదా పడింది. అసెంబ్లీ సమావే శాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేసినట్లు తెలుస్తున్నది. తిరిగి పబ్లిక్ హియరింగ్ ఎప్పుడు నిర్వహించేది కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) ప్రకటించాల్సి ఉంది.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 'ఆదర్శ' విద్యార్థినికి బ్రాంజ్ మెడల్



మెడల్‌తో భూక్యా శ్రావణి

ధర్మపురి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మగ్గిడి ఆదర్శ కళాశాల విద్యార్థిని భూక్యా శ్రావణి నేషనల్ ఫెడరేషన్ కప్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించింది.

ఈ నెల 17న ఢిల్లీలో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి ఆమె ప్రాతినిధ్యం వహించారు. ఈ పోటీల్లో శ్రావణి అత్యంత ప్రతిభ కనబరచి బ్రాంజ్ మెడల్ సాధించింది. శ్రావణిని ప్రిన్సిపల్ పద్మ, వైస్‌ప్రిన్సిపల్ మహేష్, ఫిజికల్ డైరెక్టర్ రాజేందర్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు తదితరులు అభినందించారు.

వర్గీకరణపై ప్రభుత్వానికి నివేదిక

- ఎస్సీ ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్
- ఎస్సీ ఉప వర్గీకరణపై బహిరంగ విచారణ
- షెడ్యూల్డ్ కులాల నుంచి 128 దరఖాస్తుల స్వీకరణ

కరీంనగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎస్సీ కులాల ఉప వర్గీకరణ కోసం నిర్వహించిన బహిరంగ విచారణలో తమ దృష్టికి వచ్చిన అభ్యర్థనలపై పూర్తిస్థాయి నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తామని ఎస్సీ ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల విచారణ కమిషన్ ఆధ్వర్యంలో ఎస్సీ ఉప వర్గీకరణపై బహిరంగ విచారణ నిర్వహించారు. వర్గీకరణపై ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని వివిధ ఎస్సీ కుల సంఘాలు ఇచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ వివిధ ఎస్సీ కుల సంఘాల నుంచి 128 వినతులు, అభ్యర్థనలు అందాయని తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన న్యాయపరమైన అంశాలు, ఉద్యోగ, సామాజిక పరిస్థితులు, చారిత్రాత్మక వ్యవహారాలను అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల కుల సంఘాల అభ్యర్థన లు, వినతులు సేకరించి ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక అందిస్తామని పేర్కొన్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలోని కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల నుంచి ఎస్సీ కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. అనంతరం సోషల్ వెల్ఫేర్‌శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగేశ్వర్‌రావు, ఆర్డీవో కే మహేశ్వర్, జగిత్యాల డీఎస్‌డీవో రాజ్‌కుమార్, సిరిసిల్ల డీఎస్‌డీవో విజయలక్ష్మి, ఎస్‌డబ్ల్యూవోలు తిరుపతి, విజయపాల్‌రెడ్డి, పలువురు అధికారులు, వివిధ ఎస్సీ కుల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం స్వీకరిస్తున్న ఎస్సీ ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి

ధర్మపురి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినులు సింధూజ, ముస్కాన్, సిద్దిక, అక్షయ, లస్మిత్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ఐదుగురు విద్యార్థినులు ఫుట్‌బాల్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థినులు పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్ జ్యోతి, పీఈటీ భారతి, ఆర్ఎల్‌సీ రాజేందర్, డీఎండబ్ల్యూ చిత్రు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

అయ్యప్ప ఆలయంలో లక్ష పుష్పార్చన

రాయికల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలో అయ్యప్ప ఆలయం నిర్మించి 22 ఏళ్ల పూర్తయిన సందర్భంగా సాయప్ప ట్రస్టు చైర్‌పర్సన్ సీహెచ్‌ఎస్‌వీ నివేదిత కృష్ణారావు, వైస్‌చైర్మన్ హిమవంతరావు ఆధ్వర్యంలో ఆలయంలో అయ్యప్పస్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కోరుట్లలో గీతా యజ్ఞాలు

కోరుట్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గీతా యజ్ఞాలతో కోరుట్ల ప్రాంతం ఆధ్యాత్మికతను సంతరించుకుంటోంది. 20 ఏళ్ల నుంచి గీతా సత్సంగ్, సుందర సత్సంగ్ ఆధ్వర్యంలో శ్రీమద్భగవ ద్గీతపై ప్రచారం చేస్తున్నారు. గీతా కంఠస్థ శిక్షణ తరగతులు నిర్వహిస్తూ భక్తి భావనలు పెంపొందిస్తున్నారు. గీతా సత్సంగ్ వ్యవస్థాపకుడు చీలమంతుల చత్రపతి ఆధ్వర్యంలో కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలతో పాటు పలు మండలాల వారికి శిక్షణను అందిస్తూ అభి నందనలు అందుకుంటున్నారు. కోరుట్ల పట్టణంలోని వేంకటేశ్వర దేవాలయంలో ప్రతి శనివారం ఉదయం గీతా కంఠస్థ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతి ఆదివారం మురళి కృష్ణ ఆలయంలో విద్యుత్ శాఖ రిటైర్డ్ ఎస్‌ఈఈ దొంతుల రాంకిషన్ ఆధ్వర్యంలో ఉదయం, ఆదే విధంగా కోరుట్ల మండలం, మెట్‌పల్లి పట్టణం, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండల కేంద్రాలతో పాటు వివిధ గ్రామాలలో కంఠస్థ తరగతులను నిర్వహిస్తున్నారు.

సమసిపోయిన ఎన్టీపీసీ బూడిద వివాదం

- రూ.20కోట్ల సీఎస్ఆర్ నిధులు ఇచ్చేందుకు అంగీకారం

గోదావరిఖని, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ యాష్‌పాండ్ బూడిద తరలింపు వివాదానికి తెరపడింది. ఎన్టీపీసీ నుంచి ఈ ప్రాంత అవసరాలకు, అభివృద్ధికి రావాల్సిన నిధులు మంజూరు కాకపోవడంతో బూడిద తరలింపును నిలిపివేశారు. రెండు నెలలుగా ఎన్టీపీసీ యాష్ పాండ్ నుంచి ఎన్‌హెచ్ హైవేల కోసం తరలించాల్సిన బూడిద లారీలు నిలిచిపోయాయి. ఎన్టీపీసీ 15లక్షల టన్నుల బూడిద తరలింపునకు ఆన్‌లైన్‌లో పిలిచిన టెండర్ల బూడిద ట్రాన్స్‌పోర్టు కూడా నిలిచిపోయింది. దీంతో రోజూ ఐదు వేల టన్నుల చొప్పున సుమారు రెండున్నర లక్షల టన్నుల బూడిద యాష్‌పాండ్‌లో పేరుకుపోయింది. దీంతో ఆందోళన చెందిన ఎన్టీపీసీ యాజమాన్యం ప్రభుత్వాన్ని ఆశ్రయించింది. బుధవారం రామగుండం ఎన్టీపీసీ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి కోసం రూ.20కోట్ల సీఎస్ఆర్ మంజూరు చేస్తామని ఎన్టీపీసీ ఉన్నతాధికారులు హామీ ఇవ్వడంతో ఈ వివాదం సమసిపోయింది. ఒకటి రెండు రోజుల్లో ఎన్టీపీసీ యాష్‌పాండ్ నుంచి బూడిద తరలింపునకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఎన్టీపీసీ ఉన్నతాధికారులు బుధవారం అసెంబ్లీలో మంత్రి శ్రీధర్‌బాబు చాంబర్‌లో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌కు ఈ మేరకు హామీ ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఈ వివాదానికి తెరపడింది.

బెనిఫిట్స్‌పై కమిటీ పేరుతో ప్రభుత్వం కాలయాపన



పెన్షనర్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు

తిమ్మాపూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు రావాల్సిన బెనిఫిట్స్ చెల్లించకుండా, బెనిఫిట్స్‌పై కమిటీల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని రిటైర్డ్ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య అన్నారు. జాతీయ పెన్షనర్స్ డే పురస్కరించుకొని మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల రిటైర్డ్ పెన్షనర్ల సంఘ భవనంలో ఎల్ఎండీ యూనిట్ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి గాజుల నర్సయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పదవీవిరమణ పొందిన పెన్షనర్లకు రావలసిన పీఆర్సీ, డీఏలు, ఇతర బెనిఫిట్స్‌పై ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. అనంతరం ఎల్ఎండీ యూనిట్ పెన్షనర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావుల సత్యనారాయణ, మన్నే జయచందర్ ఆధ్వర్యంలో రిటైర్డ్ పెన్షనర్ల ను సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ పెన్షనర్ల జిల్లా అధ్యక్షుడు పెండ్యాల కేశవరెడ్డి, ఉపాధ్యక్షుడు చల్లా మోహన్‌రెడ్డి, సెక్రెటరీ ఇ లింగయ్య, కోశాధికారి ఎన్ రాజేశం తదితరులు పాల్గొన్నారు.

సీఆర్ఐఎఫ్ నిధుల కోసం వినతి



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం అందిస్తున్న బండి సంజయ్

- కేంద్ర మంత్రి గడ్కరీని కోరిన హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

కరీంనగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని గ్రామాలకు 224 కోట్ల రూపాయల సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఐఎఫ్) నిధులు మంజూరు చేయాలని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్‌గడ్కరీకి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ బుధవారం వినతిపత్రం అందించారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సదుపాయం మెరుగు పర్చేందుకు సీఆర్ఐఎఫ్) నిధులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ నియోజక వర్గంలోని గ్రామీణ రోడ్లు, వంతెనల అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై గడ్కరీ దృష్టికి తీసుకు వచ్చారు. సింగిల్ లేన్ రోడ్లను డబుల్ లేన్ రోడ్ల విస్తరణ పనులకు సంబంధించి ప్రతిపాదన చేశారు. ప్రధానంగా కేశవపట్నం, పాపయ్యపల్లె మీదుగా సైదాపూర్ వరకు 15 కి.మీ.ల సింగిల్‌రోడ్డును డబుల్ లేన్‌గా విస్తరించాలన్నారు. కొడిమ్యాల నుండి గోవిందారం మీదుగా తాండ్రియాల వరకు 30 కి.మీ. మేరకు సింగిల్ లేన్ రోడ్డును డబుల్ లేన్‌గా విస్తరించాలన్నారు. చొప్పదండి మండలం ఆర్నకొండ నుంచి గోపాల్‌రావుపేట మీదుగా మల్యాల చౌరస్తా వరకు 45 కి.మీ.లు, ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ నుంచి సింగారం మీదుగా ముస్తాబాద్ మండలం రాంరెడ్డి పల్లె వరకు15 కి.మీ.ల రోడ్డును డబుల్ లేన్‌గా విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ జిల్లాలోని గుండ్లపల్లి పోతూరు రోడ్డు (కి.మీ.18/0-2) బావుపేట, ఖాజీపూర్ (కి.మీ 2/0-2) వరకు మానేరు నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. దీనిపై కేంద్ర మంత్రి గడ్కరీ సానుకూలంగా స్పందించి త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని బండి సంజయ్‌కుమర్ తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గ పరిధిలో ఇప్పటికే సీఆర్ఐఎఫ్ నిధులతో చేపట్టిన పనుల పురోగతిపై నితిన్‌గడ్కరీ ఆరా తీశారు.

ఘనంగా మల్లికార్జున స్వామి జాతర

- బోనాలు సమర్పించిన భక్తులు





బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు, మల్లికార్జునస్వామి ఉత్సవ మూర్తి

గొల్లపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లన్నపేట గ్రామంలో జరుగుతున్న మల్లికార్జున స్వామి జాతర కొనసాగుతోంది. ఉత్సవాల్లో భాగంగా మూడో బుధవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి బెల్లం పానకంతో వండిన బోనాలను ఇష్టదైవానికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శివసత్తుల పూనకాలు, ఒగ్గు పూజారుల ఢమరుకనాదాలు, భక్తుల మల్లన్న నామస్మరణలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో భక్తులు మల్లన్న పట్నాలు వేసి ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై చిర్ర సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సుమారు 30వేల మంది స్వామివారిని దర్శించుకోగా ప్రత్యేక దర్శనానికి విక్రయించిన టికెట్ల ద్వారా ఆలయానికి 57,630 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య, ఆలయ ఈవో విక్రమ్ తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, తాజా మాజీ ప్రజాప్రతినిధులు నర్సయ్య, రాజన్న, కిషోర్, సత్తయ్య, నాయకులు మల్లయ్య, సుధాకర్, చందు భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న డీఈవో మాధవి

ముత్తారం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని తొగరి సహస్ర రాష్ట్రస్థాయి టాలెంట్ పోటీలకు ఎంపికైంది. పెద్దపల్లిలో బుధవారం జీవ శాస్త్రంపై జిల్లాస్థాయి టాలెంట్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచింది. ఈనెల 28న హైదరాబాద్లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సహస్రకు డీఈవో మాధవి ప్రశంసాపత్రం అందించి అభినందించారు. ముత్తారం కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వప్న విద్యార్థిని, జీవశాస్త్రం ఉపాధ్యాయురాలు తోట రాధిక అభినందించారు.

కారు అద్దాలు ధ్వంసం.. కేసు నమోదు

కరీంనగర్ క్రైమ్, డిసెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): కార్ఖానాగడ్డ గాంధీ చౌరస్తాలో బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో కారు అద్దాలను ధ్వంసం చేసి డ్రైవర్‌పై చేయిచేసుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తుండగా మరో వ్యక్తి వచ్చి కారు డ్రైవర్‌పై దాడి చేసి, కారు అద్దాలు ధ్వంసం చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇంటర్వ్యూ

అందరి సహకారంతో అభివృద్ధి చేస్తున్నాం

ధర్మపురి మున్సిపల్ కమిషనర్ కందుకూరి శ్రీనివాస్



ధర్మపురి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మున్సిపల్ ఆదాయం ఏడాదికి సుమారు 2.16 కోట్లు కలిగి ఉంది. మున్సిపల్ జనాభాకు అనుగుణంగా ప్రజలు, అధికారుల సహకారంతో అన్ని వార్డుల్లో అభివృద్ధి చేస్తున్నాం. ఎక్కడ సమస్యలు ఉన్నా నేరుగా వెళ్లి పరిష్కరిస్తున్నామని కమిషనర్ శ్రీనివాస్ 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

ఆంధ్రజ్యోతి: ధర్మపురి మున్సిపాలిటీ ఆదాయం ఎంత ఉంది

అధికారి: మున్సిపాలిటీకి సుమారు 2.16 కోట్ల పైగా ఆదాయం ఉంది. ఇందులో ఆస్తి పన్ను 1.26 కోట్ల ఆదాయం ఉండగా ట్రేడింగ్ లైసెన్స్, వాటర్ పన్ను, బిల్డింగ్ పర్మిషన్, శనివార సంత, పశువుల సంత, ఇతరత్రా ఆదాయం 60లక్షలు ఉంది. వాహన పార్కింగ్ ద్వారా సమారు 40 లక్షలు ఆదాయం సమ కూరుతోంది.

ఆంధ్రజ్యోతి: మున్సిపల్ పన్నుల వసూలు ఎలా ఉంది.?

అధికారి: పన్నుల వసూలులో వెనుకబడి ఉంది. మొత్తం 15 వార్డుల్లో ఉన్న అధికారులకు సమగ్ర కుటుంబ సర్వే, ఇందిరమ్మ ఇళ్ల సర్వే కోసం విధులు అప్పగించాము. దీంతో అధికారులు కేవలం 30 శాతం వరకు మాత్రమే వసూలు చేశారు.

ఆంధ్రజ్యోతి: కమర్షియల్ దుకాణాలు ఎన్ని ఉన్నాయి. ఎంత మంది లైసెన్సులు కలిగి ఉన్నారు.

అధికారి: కమర్షియల్ దుకాణాలు మొత్తం 555 ఉన్నాయి. ఇందులో 40 వరకు లైసెన్సులు కలిగి ఉండగా ఇటీవల 100 వరకు లైసెన్సులు ఇచ్చాము. త్వరలో మొత్తం కమర్షియల్ దుకాణాలకు లైసెన్స్‌లు ఇచ్చి ఫీజు వసూలు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: పట్టణంలో ఎలాంటి అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి

అధికారి: అమృత్ జల్ పథకం కింద రూ 22 కోట్లతో పనులు చేపట్టాము. ఈ నిధులతో మిషన్ భగీతర పంపు హౌస్ వద్ద ఒకటి, చింతామణి చెరువు వద్ద ఒకటి వాటర్ ట్యాంక్‌లు అవసరం ఉన్న చోట తాగు నీటికి పై పులైన్ విస్తరణ పనులు చేపట్టాము.

పశువైద్య ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు

కలెక్టర్ సత్యప్రసాద్



చౌలమద్దిలో ప్రాథమిక పశువైద్య కేంద్రంలో ఆన్‌లైన్‌లో నమోదు వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

కోరుట్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పశువైద్య ఆసుపత్రి కేంద్రం ఏర్పాటు చేసి పశుపోషకుల ఇబ్బందులు తొలగించాలని కలెక్టర్ సత్యప్రసాద్ రెవెన్యూ, పశువైద్య అధికారులకు ఆదేశాలను జారీ చేశారు. బుధవారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో ఉన్న పశువైద్య ఆసుపత్రి కలెక్టర్ సందర్శించి మొదటి అంతస్తులో ఉండడంతో పశుపోషకులకు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించారు. పశువులకు వైద్యం నిర్వహించే విధంగా తాత్కాలిక భవనం ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య, పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ మనోహర్, సహాయ సంచాలకులు డాక్టర్ నరేష్, పశువైద్య కేంద్ర పశువైద్యాధికారి డాక్టర్ మనీషా, ఆర్డీవో జీవాకర్‌రెడ్డి, డాక్టర్ సంతోష్, తహసీల్దార్ కిషన్, ఎంపీడీవో రామకృష్ణలతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రతీ గ్రామంలో పశుగణన చేపట్టాలి

మెట్‌పల్లి రూరల్ : ప్రతి గ్రామాల్లో పశుగణన చేపట్టి త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సత్య ప్రసాద్ అధికారులకు సూచించారు. మండలంలోని చౌలమద్ది గ్రామంలోని ప్రాథమిక పశువైద్య కేంద్రాన్ని బుధవారం జిల్లా పశువైద్యాధికారి మనోహర్, మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్‌తో కలిసి తనిఖీ చేశారు. పశువైద్య కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలు గుర్తించి ఆరా తీశారు. కేంద్రంలోని రికార్డులు, గాలికుంటు టీకాల కార్యక్రమాలు, టీకాల వివరాలు, వాక్సిన్‌లు భద్రపరించిన వాటిని పరిశీలించారు. టీకాలు, పశుగణన వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వాటి వివరాలను మండల వైద్యాధికారి మనీషా పటేల్‌ను అడిగి తెలుసుకున్నారు. గడువుతీరిన మందులను గుర్తించి వెంటనే తొలగించాలని, మళ్లీ ఇలాంటి తప్పులు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి నరేష్, డాక్టర్ మనీషాపటేల్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో మహేశ్వర్ రెడ్డి, ఆర్‌ఐ ఉమేష్, పంచాయతీ కార్యదర్శి రవి, అధికారులు, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

అధికారులు విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ సత్యప్రసాద్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని వెల్లుల్ల గ్రామంలోని పల్లెప్రగతి వనం, కంపోస్టు షేడ్, డంపింగ్ యార్డు, వైకుంఠధామం మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రకృతి వనంలో ఎండిపోయిన చెట్లతో పాటు నరికివేసిన చెట్ల గురించి ఎంపీడీవోను అడగా నిర్లక్ష్య సమాధానం చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. చెట్ల నరికివేతపై రిపోర్టు ఇవ్వాలని ఆదేశించారు. వైకుంఠధామంలోని స్నానాల గదులను శుభ్రం చేయాలని, నీటి సౌకర్యంతో పాటు వసతులు కల్పించాలని ఆదేశించారు. తడిపొడి చెత్తను వేరువేరుగా సేకరించి డిపంగ్ యార్డుకు తరలించాలని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో నాటిన మొక్కలు, చెట్లపై నిర్లక్ష్యం వహించరాదన్నారు. గ్రామాల్లో కాలనీలు, వైకుంఠధామాలు శుభ్రం చేయించాలని అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, ఆర్‌ఐ ఉమేష్, పంచాయతీ కార్యదర్శి నారాయణ, అధికారులు, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 18 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు పి. జయలక్ష్మి డిమాండ్ చేశారు. ముఖమంత్రి రేవంత్ రెడ్డి హామీ ప్రకారం ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు 18 వేల రూపాయల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని కోరుతూ సిఐటియు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు జాతా బుధవారం జగిత్యాల పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆశా వర్కర్లు స్థానిక తహసీల్ చౌరస్తా నుంచి పట్టణంలోని దేవిశ్రీ గార్డెన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

అనంతరం జయలక్ష్మి మాట్లాడుతూ ఆశా వర్కర్లు క్షేత్ర స్థాయిలో పని చేస్తూ ఆరోగ్య వ్యవస్థకు మూల స్థబాలుగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నీలాదేవి, గంగామణి, సాధన, సునిత, పద్మ, బాలామణి, పుప్పాల శ్రీకాంత్ చంద్ర శేఖర్ దివ్య, పద్మ, వనిత, రాధ, దేవిక, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి

ఆలయ భూముల అన్యాక్రాంతానికి చెక్

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో ఏ ఆలయం ఎక్కడ ఉంది...దాని సరిహద్దులు...దాని పరిధిలోని భూములు ఏఏ సర్వే నంబర్‌లో ఉన్నాయి. ఇలా ప్రతీ అంశం ప్రజలకు తెలి సేలా ఇంటర్ నెట్‌లో పొందుపరుస్తున్నారు. దేవాదాయ శాఖ పరిధిలో పబ్లికేషన్ రిజిస్టర్ అయి ఉన్న ఆలయాలు, ధూపదీప నివేదన పథకం, అగ్రిక ల్చర్ ల్యాండ్స్‌ను కలిగియున్న ఆ లయాలతోపాటు అన్ని రకాల ఆలయాలను జియో ట్యా గింగ్ చేస్తున్నారు. గూగుల్ మ్యాప్స్‌లో ఏ ఆలయానికి సంబంధిం చిన సమాచారం కావాలన్నా...దానిని టైప్ చేస్తే చాలు పూర్తి సమాచారం వచ్చే లా జాగ్రత్తలు తీసు కుంటున్నారు. భూములు, ఆస్తుల వివరాలు సైతం ఫో టోల ద్వారా సేకరించి ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి జియో గ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం (జీఐఎస్) ద్వారా పరిశీలించి ఆయా భూముల సరిహద్దులను మార్కింగ్ చేస్తున్నారు. భవిష్యత్‌లో మొబైల్ యాప్‌ను రూపొందించేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. దేవాదాయ శాఖ ఈవోలు, సిబ్బందితో జీపీఎస్ మ్యాప్ కెమెరా యాప్‌లో ఫొటోలను తీయించి అక్షాంశాలు, రేఖాంశాలు, ప్రాంతం (లోకేషన్) ఆధారంగా సమాచారాన్ని దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి పంపిస్తున్నారు. అక్కడ జియో ట్యాగింగ్‌తో ఆలయా లకు సంబంధించిన కో ఆర్డినేట్ చేసి నిర్ధారిస్తారు.

● గూగుల్ మ్యాప్‌లో సెర్చ్ చేస్తే చాలు..

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ఆలయాల సమాచారం పక్కాగా తెలిసేలా జియో ట్యాగింగ్ చేస్తున్నారు. భవిష్యత్‌లో ఏదైనా ఆలయ భూమి కబ్జాకు గురైతే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తెలుసుకోవడానికి వీలు గా నిర్వహిస్తున్నారు. గూగుల్ మ్యాప్‌లో సెర్చ్‌చేస్తే చాలు అక్షాంశాలు, రేఖాం శాలతో ఆప్రదేశం చూపిస్తుంది. ఆలయ భూములు, ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా రక్షించేందుకు ఆప్రక్రియ దోహద పడుతుందని దేవాదాయ శాఖ భావిస్తోంది. ఇప్పటికే సగానికి పైగా ఆలయాలు జియో ట్యాగింగ్ పూర్తయ్యాయి. రానున్న వారం, పది రోజుల్లో వంద శాతం జియో ట్యాగింగ్ పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

● పకడ్బందీగా ఆలయాల జియో ట్యాగింగ్

సుప్రియ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్

జిల్లాలోని పలు దేవాలయాలను జియో ట్యాగింగ్ చే స్తున్నాము. ఆలయాల భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షించడంతో పాటు సులభంగా సమాచారం అందేలా చర్యలు తీసుకుంటున్నాము. ఇప్పటికే సగానికి పైగా ఆలయాలు జియో ట్యాగింగ్ పూర్తయ్యాయి. రిజిస్టర్డ్ అయిన ఆలయాల్లో ముందుగా దూప దీప నైవేద్యం పథకం కింద ఎంపికైన ఆలయాలు, అగ్రికల్చర్ ల్యాండ్, ఇతర ఆస్తులు కలిగియున్న ఆలయాలను జియో ట్యాగింగ్ చేస్తున్నాము. దీనివల్ల భవిష్యత్తులో బహుళ ప్రయోజనాలు అందనున్నాయి.

సీనియర్ సిటిజన్స్ సమాజ మార్గదర్శకులు

కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ సమాజ మార్గదర్శకులని కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్‌లో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీనియర్ సిటిజన్స్ అయిన తల్లిదండ్రులను పిల్లలు విస్మరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్, నాయకులు గౌరిశెట్టి విశ్వనాథం, పి హన్మంత్ రెడ్డి, ఎండి యాకూబ్, వెల్మల ప్రకాశ్ రావు, పూసాల అశోక్, జబ్బార్, ఇక్బాల్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

మల్లాపూర్, డిసెంబరు, 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్త దాంరాజుపల్లి గ్రామంలోని ఉమామహేశ్వర ఆలయంలో బుధవారం సామూహిక అయ్యప్ప పడి పూజ కార్యక్రమాన్ని దీక్షపరులు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా వినోద్ గురుస్వామి మంత్రోచ్చారణల మధ్య గణపతి, సుబ్రహ్మణ్యం, అయ్యప్ప విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అర్చనలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అయ్యప్ప స్వామిని పలు ద్రవపదార్థాలతో అభిషేకాలు జరిపారు. ఈ సందర్భంగా అయ్యప్ప భజన కీర్తనల నడుమ మెట్ల పూజలు చేశారు. అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థం, అన్న ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప దీక్షపరులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీల సేవా కేంద్రం రజతోత్సవాలు ప్రారంభం

కోరుట్ల రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విదాలయ కోరుట్ల శాఖ రజతోత్సవాలను బుధవారం కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య-అనిల్ ప్రారంభించారు. రజతోత్సవాలకు హైదరాబాద్ సండ్ జోన్ ఇన్‌చార్జి రాజయేగిని బ్రహ్మకుమారీ కుల్దీప్ దీదీజీ కార్యక్రమాలకు హాజరుకాగా మున్సిపల్ చైర్ పర్సన్ లావణ్య, బ్రహ్మకుమారీ కోరుట్ల శాఖ ఇన్‌చార్జి రాజేశ్వరి, కరీంనగర్ బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జి రాజయెగిని బ్రహ్మకుమారీ విజయ్‌లు పుష్ప గుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక కార్యక్రమాలలో ఆర్డీవో జీవాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, మాజీ ఎంపీపీ తోట నారాయణ, మాజీ జడ్‌పీటీసీ సభ్యురాలు దారిశెట్టి లావణ్య-రాజేష్, బీజేపీ రాష్ట్ర నాయకుడు సురభి నవీన్ రావు, మాజీ సర్పంచ్ అంజయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు లతా - రమేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.



బ్రహ్మకుమారీలకు స్వాగతం పలుకుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య - అనిల్

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

జిల్లా సెక్టోరియల్ అధికారి

రాయికల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని జిల్లా సెక్టోరియల్ అధికారి సత్యనారాయణ అన్నారు. మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు వారి పాఠశాలల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి, ఆదర్శ బోధనా పద్ధతుల గురించి చర్చించారు. బోధనోపకరణాలను తయారు చేసి ప్రదర్శించారు. ఉపాధ్యాయులు బోధనతో పాటు పాఠశాల నిర్వహణ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని, విద్యార్థులందరు కనీస సామర్థ్యాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు సకాలంలో వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీపతి రాఘవులు, పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయుడు మామిడాల శ్రీనివాస్, జిల్లా రిసోర్స్ పర్సన్ కడకుంట్ల అభయ్ రాజ్, మండల రిసోర్స్ పర్సన్ ఉషకోల రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని మండలాల్లో రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసే బాధ్యత ప్రతి ఉద్యోగి తీసుకోవాలని ఎన్పీడీసీఎల్ సీఎండి వరుణ్‌రెడ్డి సిబ్బందికి ఆదేశించారు. బుధవారం పట్టణం లోని వెంకట్రావ్‌పేట ఇంటర్ లింకింగ్ పనులను, ఇబ్రహీంపట్నం మండలం గోధుర్ 132 కెవి సబ్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎత్తు తక్కువగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ గద్దెలు పెంచాలని, అవసరమున్న చోట మధ్యంతర స్తంభాలు వేసి వేలాడే తీగలు సరి చేయాలని అన్నారు. ప్రతి నెల 10 శాతం ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ చేపట్టి సరి చేయాలని ఆదేశించారు. రాబోయే మూడు నెలల్లో ప్రమాదరహిత జిల్లాగా నిలబెట్టాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఈలు ఆశోక్, తిరుమలరావు, ఎస్ఈలు శాలియానాయక్, శ్రీనివాస్, డీఈలు గంగారాం, రవీందర్, గోపీకృష్ణ, ఏడీఈలు మనోహర్, ఏఈలు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

జగిత్యాల అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఐదు సంవత్సరాల నుంచి పేరుకు పోయిన విద్యార్థుల బోధనా రుసుములు రూ.4967.18 కోట్లను వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉండటం వల్ల ఉన్నత చదువులు చదవలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిరిపురం రాంచందర్, దండుగుల వంశీ, రోజా, నరేష్, మల్లేశ్వరి, హృషికేష్ తదితరులు పాల్గొన్నారు.

నగదు అందజేత

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మార్కెట్ రోడ్డులో ఈ నెల 7న పోగొట్టుకున్న రూ. మూడు లక్షల నగదును బాధితుడికి సీఐ నిరంజన్‌రెడ్డి బుధవారం అందజేశారు. మెట్‌పల్లికి చెందిన హఫీజ్ సీఐని కలిసి డబ్బులు ఎలా పోగొట్టుకున్నాడో వివరించారు. తను కూరగాయల వ్యాపారం కోసం కోరుట్లకు చెందిన ఎండి మోహిజ్ నుంచి తీసుకున్న డబ్బులు మార్కెట్ రోడ్డులో పోయినట్లు సరైన ఆధారాలతో తెలిపారు. దీంతో విచారణ చేపట్టిన సీఐ బాధితుడు హఫీజ్‌కు పోలీస్ స్టేషన్‌లో డబ్బులు అప్పగించాడు.

'రైతులకు మెరుగైన సేవలు అందించాలి'

కథలాపూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైతులకు మెరుగైన సేవలకు అందించాలని సహకార సంఘ జిల్లా అధికారి మనోజ్ కుమార్ సొసైటీ అధికారులకు సూచించారు. బుధవారం మండలంలోని భూషణ్‌రావుపేట, గంబీర్‌పూర్ గ్రామంలోని సింగిల్ విండో సొసైటీలను సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. రైతు రుణాలు, వరి ధాన్యం కొనుగోలు వివరాల నమోదు రికార్డును పరిశీలించారు. భూషన్‌రావుపేటలో సొసైటీని మూడు సొసైటీలుగా విభజించాలని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సిఫార్స్ మేరకు పరిశీలన జరిపి వివిరాలను అడిగి తెలుసుకున్నారు. గంబీర్‌పూర్ చైర్మెన్ శ్రీనివాస్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

మంత్రి జూపల్లిని కలిసిన జగిత్యాల ఎమ్మెల్యే

జగిత్యాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎక్సయిజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ హైద్రాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. నియోజక వర్గానికి టూరిజం ప్రాజెక్టు మంజూరు చేయాలని, జగిత్యాల అర్బన్ మండల అంబారిపేటలో నగర్ వన్ ప్రాజెక్టు, బీర్‌పూర్‌లో రోళ్ళవాగు ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

జిల్లా విద్యాధికారి రాము



విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేస్తున్న డీఈవో రాము, పక్కన అధికారులు

బీర్‌పూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, తెలుగు, ఆంగ్లం, గణితంలో కనీస సామర్థ్యాలు సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో రాము అన్నారు. బుధవారం బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో గల మండల ప్రజాపరిషత్ పాఠశాలలో ప్రాథమిక పాఠశాలల స్థాయి కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి డీఈవో హాజరై పాధ్యాయులకు దిశా నిర్దేశం చేశారు. విద్యార్థికి తొలిమెట్టు ప్లాన్‌లో సాధించాల్సిన సామర్థ్యాలు చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలు తెలుగు, ఆంగ్లం, గణితంలో కనీస సామర్థ్యాలు సాధించాలని వాటి కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి 10వ తరగతి విద్యార్థులు 100శాతం ఫలితాలు వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా సెక్టోరల్ ఆఫీసర్ మహేష్, మండల విద్యాధికారి సిరుప నాగభూషణం, స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, రిసోర్స్ పర్సన్ సుదర్శన్, లచ్చయ్య, రమాదేవి, సుజాత, తుంగూర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం హేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవశాస్త్రంపై జిల్లాస్థాయి ప్రతిభా పోటీలు

జగిత్యాల అగ్రికల్చర్: జీవశాస్త్ర ప్రతిభపై బయో సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రతిభ పరీక్షలో వివిధ మండలాల నుంచి సుమారు 70 మంది మండల స్థాయి విజేతలు పాల్గొని తమ ప్రతిభను కనబర్చారు. కాగా ఇంగ్లీష మీడియం విభాగంలో జిల్లా స్థాయిలో టీజీఎంఎస్ గొల్లపెల్లి విద్యార్థిని ప్రథమ బహుమతి సాధించగా, మెట్‌పెల్లి ఎంజేపీ(బాయ్స్)కు చెందిన శశివర్ధన్ ద్వితీయ బహుమతి సాధించాడు. తెలుగు మీడియం విభాగంలో టీఆర్‌నగర్ జడ్పీహెచ్ పాఠశాలకు చెందిన శివానీ ప్రథమ స్థానంలో నిలవగా, సారంగాపూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన రాజవర్ధన్ ద్వితీయ బహుమతి సాధించారని నిర్వాకులు తెలిపారు. విద్యార్థులకు డీఈవో రాము చేతుల మీదుగా ప్రశంసాపత్రం, మెమోంటోతో పాటు నగదు ప్రోత్సాహకం అందజేసి విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో టీబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరబత్తిని రాజగోపాల్, పత్తిపాక తిరుపతి, డీఎస్‌వో మచ్చ రాజశేఖర్, ఎస్‌వో మహేష్, డీసీఈబీ సెక్రటరీ మురళీమనోహరాచారి, ఉపాధ్యాయ సంఘ నాయకులు అమర్నాథ్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయులు మచ్చశంకర్, రామకృష్ణ, పెద్దిరాజం, రమేష్, నర్సయ్య, ప్రశాంతి, రా మకృష్ణ తదితరులున్నారు.

కరపత్రం ఆవిష్కరణ

జగిత్యాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మెట్‌పల్లి మినీ స్టేడియంలో వచ్చే నెల 2వ తేదీన నిర్వహించనున్న ద్విశత పేరిణి నృత్యోత్సవ మహాబృందనాట్యం కరపత్రాలను కలెక్టర్ సత్య ప్రసాద్ ఆవిష్కరించారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో మీనాక్షి నృత్య కళానిలయం ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. మీనాక్షి నృత్య కళానిలయం సంస్థ నిర్వాహకులు శ్రీవాణి, గౌరవ అధ్యక్షుడు గంగాధర్, పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రెల మృతి

ఎండపల్లి, డిసెంబర్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెర్లపల్లి గ్రామంలో కుక్కల దాడిలో 14 గొర్రెలు బుధవారం మృతి చెందాయి. గ్రామానికి చెందిన కంకటి మల్లయ్య గొర్రె పిల్లలను షెడ్డులో ఉంచి వెళ్లాడు. మధ్యాహ్నం షెడ్డులోకి కుక్కలు చొరబడి గొర్రెలపై దాడి చేసి చంపేసాయి. వాటి విలువ సుమారు 60 వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

'అర్హులందరికీ ఇండ్లు నిర్మించి ఇవ్వాలి'



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

కోరుట్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించి ఇండ్లు కట్టించి అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వెన్న సురేష్, మాజీ కార్యదర్శి ఎద్దండి భూమయ్యలు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో నిరుపేదలతో ప్రత్యేక సమావేశం నిర్వ హించి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో జీవాకర్‌రెడ్డికి వినతి ప్రతం అందించిన నాయకులు నిరుపేదలకు స్థలం కేటాయించి ఇండ్లు నిర్మాణం చేసి అందించాలని కోరారు. పట్టణంలోని వివిధ వార్డులలో నిరుపేదల నుంచి సేకరించి దరఖాస్తులను ఆర్డీవోకు అందించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడారు. గత ప్రభుత్వంలో 1500 మంది నిరుపేదలకు ఇండ్ల కోసం దరఖాస్తులు చేసుకుంటే కేవలం 80 ఇం డ్లు కేటాయించి అందించి నిరుపేదలను మోసం చేసిదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయ కులు చెన్న విశ్వనాథం, ఎండి మౌలానా, మునుగోరి హన్మంత్, దేవదాస్, రామిల్ల రాంబాబు, ఎన్నం రాధ, సాంబారి మహేష్, అందే రామయ్య, ఎండి సమీర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బీర్‌పూర్: మూడు రోజుల క్రితం దొంగల దాడిలో గాయపడ్డ మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారి కాసం ఈశ్వరయ్య కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరామర్శించారు.

రాయికల్ : మున్నూరుకాపు కులస్థుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, జగిత్యాల నియోజక వర్గ ఇన్‌చార్జి డాక్టర్ బోగ శ్రావణి అన్నారు. రాయికల్ మండలంలోని రామాజీపేట గ్రామంలో మున్నూరుకాపు సంఘ భవనానికి నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు అర్వింద్ ధర్మపురి నిధులు మంజూరు కాగా బుధవారం భూమిపూజ చేశారు. మండల అధ్యక్షుడు అన్నవేణి వేణు, మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, పాల్గొన్నారు.

● రాయికల్ మండలంలోని పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద చెక్కులు మంజూరు కాగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు బుధవారం లబ్ధిదారులకు అందజేశారు.

ధర్మపురి: సీఎం కప్ 2024 రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టు విజేతగా ధర్మపురి మండల బాలికల జట్టు నిలిచింది. జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద స్టేడియంలో సీఎం కప్ 2024 రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. కబడ్డీ బాలికల విభాగంలో పలు మండలాల నుంచి 20 జట్టు పోటీ పడగా ధర్మపురి మండల బాలికల కబడ్డీ జట్టు విజేతగా నిలిచింది. ఈ క్రీడాకారులను ధర్మపురి ఎంఈవో సీతా లక్ష్మి, కోచ్‌లను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.

● ధర్మపురి పట్టణంలోని జూనియర్ కళాశాలలో జగిత్యాల జిల్లా పోలీస్ కళాబృందం చే షీటీం, సైబర్‌క్రైం, ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గీతాలను పాడుతూ విద్యార్థులను చైతన్యపరిచారు. ధర్మపురి ఎస్సై ఉదయ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

సారంగాపూర్ : జిల్లా స్థాయిలో నిర్వహించిన బయలాజికల్ సైన్ టాలెంట్ టెస్ట్‌లో సారంగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన అల్లెపు రాజవర్ధన్ అత్యంత ప్రతిభ కనబరిచి ద్వితతీయ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయిలో జరిగే టాలెంట్ టెస్ట్‌కు ఎంపికయ్యాడు.

● సీఎం కప్(2024) జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ఖోఖోలో సారంగాపూర్ జట్టు ప్రతిభ కనబరిచి రెండవ స్థానం కైవసం చేసుకుంది. క్రీడ కారులను మండల ఎంఈవో కిషోర్ వ్యాయమ ఉపాధ్యాయులు రవీందర్, అజయ్ అభినందించారు.